

ఫిట్‌నెస్ పరీక్ష..



జిల్లాలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరిశీలిస్తున్న ఎంవీఐ(ఫైల్)

- జిల్లాలో 165బస్సులు.. ఫిట్‌నెస్ పొందినవి 97..
- ఫిట్‌నెస్ లేకుండా రోడ్డు మీదికి వస్తే సీజ్ తప్పదు
- నిశితంగా పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు
- ఈనెల 15 తరువాత స్పెషల్ డ్రైవ్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పాఠశాలల్లో అడుగుపెట్టేందుకు విద్యార్థులు సిద్ధమయ్యారు. కానీ వారు బడికి వెళ్లే బస్సులు మాత్రం సిద్ధం కావడంలేదు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల బస్సులు రోడ్డెక్కాలంటే ఫిట్‌నెస్ తప్పనిసరి అని తెలిసినా యాజమాన్యాలు ఏటా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. రోడ్డు రవాణాశాఖ అధికారులు స్పెషల్‌డ్రైవ్ మొదలు పెడితే కానీ ముందుకు రాని పరిస్థితి ఉంటోంది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఈసారి రవాణాశాఖ అధికారులు ముందగానే అప్రమత్తమయ్యారు. తనిఖీలు ముమ్మరం చేశారు. విద్యాసంస్థలు జూన్ 12నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యజమాన్యాలు అడ్మిషన్ల వేట ప్రారంభించాయి. ప్రతియేటా యజమానులు బస్సుల ఫిట్‌నెస్ విషయంలో నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తారనే ఆరోపణలున్నాయి. ఈనెల15 తరువాత స్పెషల్‌డ్రైవ్ కూడా నిర్వహించనున్నారు. ఫిట్‌నెస్‌లేని వాహనాలు రోడ్డు మీదికి వస్తే సీజ్ చేయనున్నారు. జిల్లాలో 165బస్సులు ఉండగా, 97 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ చేయించారు. 65బస్సులు ఫిట్‌నెస్ చేయించాల్సి ఉంది. పాఠశాలలు, కళాశాలలకు వినియోగించే బస్సులు వాహన రిజిస్ట్రేషన్ అయిన నుంచి 15 ఏళ్ల మాత్రమే రోడ్డుమీద తిరిగే అవకాశం ఉంటుంది. అలాంటి బస్సులు జిల్లాలో మూడు ఉన్నట్లు గుర్తించారు. రవాణా శాఖ ఫిట్‌నెస్ విషయంలోనూ 15 ఏళ్లు దాటిన బస్సులపై పూర్తిగా కఠినంగా వ్యవహరించడంతో పాటు నిశితంగా పరిశీలిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్‌లేని వాహనాల్లో స్కూల్ పిల్లలను తీసుకవెళ్లి ప్రమాదాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్

ఆన్‌లైన్‌లో విద్యా సంస్థ పూర్తి వివరాలు, వాహన యజమాని వివరాలతో వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. చిన్న వాహనానికి రూ.800, పెద్ద వాహనానికి రూ.వెయ్యి రుసుము చెల్లించాలి. పాత వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ అదనంగా ఉంటుంది. ఫిట్‌నెస్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న తేది సమయం కేటాయించిన రోజు సంబంధిత ఆర్టీఏ కార్యాలయానికి బస్సును ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోవాలి. తరువాత సర్టిఫికెట్ జారీ చేస్తారు.



● నిబంధనలు ఇవీ...

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్‌కు సంబంధించిన పత్రాలు పొందడానికి నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. ఇందుకు కఠినంగానే నిబంధనలు పరిశీలిస్తున్నారు.

- విద్యార్థులను పరిమితికి మించి తీసుకవెళ్లరాదు.
- బస్సు చక్రాలు కొత్తవిగా ఉండాలి. 10 శాతం కన్నా ఎక్కువగా అరుగుదల ఉండవద్దు.
- బస్సుకు అద్దాలు ఉండాలి.. ఎమర్జెన్సీ డోర్ తప్పనిసరిగా ఉండాలి.
- సరిపడా మందులతో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలి.
- బస్సు క్లచ్, బ్రేక్ ఎప్పుడూ సరిచూసుకోవాలి.
- చిన్నపిల్లల బస్సులో 325 సెంటిమీటర్ల పైనా మెట్లు ఉండాలి.
- బస్సుకు సైడ్ రెయిలింగ్ అవసరం. బస్సులో నిలువు రాడ్లు ఉండాలి, కార్నిక్స్ మిర్రర్ ఉండాలి. ఈ అద్దంగుండా బస్సులోని పిల్లలను ఎప్పటికప్పుడు డ్రైవర్ పరీక్షించాలి.
- బస్సుకు అప్పర్‌లైట్లు ఉండాలి. బస్సును నిలిపినపుడు ఈ లైట్లు వెలుగుతూ ఉండాలి.
- ప్రతి బస్సులో సహాయకుడు ఉండాలి. బస్సులో ప్రయాణించే ఆయా పిల్లల వివరాలు, చిరునామా, మొబైల్ నంబర్ బస్సు చార్ట్‌లో పొందుపరచాలి.
- విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్‌తో కలిసి నెలకొకసారి వాహనాన్ని పరిశీలించాలి.

- మిగతా 8లో

పేదలకు వరం.. సీఎం సహాయనిధి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన దరియా శస్త్ర చికిత్స కోసం మంజూరైన లక్షి 50 వేల చెక్కును తన నివాసంలో మంగళవారం అందజేసి మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌ల్లో అధికారుల తనిఖీలు


ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సిరిసిల్ల టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత మాట్లాడారు. ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం సిరిసిల్ల పట్టణంలో అనుమతులు లేని ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లను తనిఖీ చేశామన్నారు. అనుమతులు లేని ప్రైవేటు ఆసుత్రులు, ల్యాబ్‌లను సీజ్ చేయడంతో పాటు జరిమానాలు కూడా విధించామన్నారు. ఇప్పటికైనా అనుమతులు లేని ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌ల యజమానులు అనుమతులు తీసుకోవాలని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి..


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేశ్వర్లు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులను మంగళవారం నిర్వహించారు. ఆర్డీవో సింగారంలోని సదస్సును సందర్శించారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిశీలించారు. భూ భారతి చట్టం ప్రకారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు గ్రామాల్లో 12 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ శ్రవణ్, సిబ్బంది, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో దివ్యాంగుల ఉపకరణాల కోసం అర్హులైన వారందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దివ్యాంగుల కోసం రెట్రో ఫిటెడ్ మోటార్‌సైకిళ్ల-37, బ్యాటరీ వీల్ చైర్స్ 11, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్స్ 15, బ్యాటరీ మినీ ట్రైండింగ్ ఆటోలు 1, హైబ్రిడ్ వీల్ చైర్‌లు 4, డీగ్రి చదివిన దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు 12, ఉన్నత విద్య చదివే వారికి సాంకేతిక విద్య చదివే వారికి ట్యాబ్‌లు 5, 9.5 స్మార్ట్‌ఫోన్‌లు 2, ట్రైసైకిల్స్ 5, వీల్‌చైర్స్ 5, క్రచెస్ 18, వినికిడి పరికరాలు 2, వాకింగ్ స్టిక్స్ 9, స్మార్ట్ కేన్స్ చప్పల్స్ 9 మొత్తం 162 పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక్కరికి ఒక్క వస్తువు మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో తీసుకోని వారికి మాత్రమే ఇస్తామని పేర్కొన్నారు.

అర్హులైన దివ్యాంగులు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, నివాసం ధ్రువీకరణ పత్రం, సదరం సర్టిఫికేట్‌లతో ఆన్‌లైన్‌లో ఈనెల 18వ తేదీవరకు దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం జిల్లా కలెక్టరేట్‌లోని సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని లక్ష్మీరాజం ప్రకటనలో కోరారు.

చల్లగా చూడు పోచమ్మ తల్లీ..

- బద్ది పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిన బద్ది పోచమ్మ ఆలయ ముందుభాగం 7

ఆరోగ్య పథకాల లక్ష్యాలు సాధించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రజిత 8

ఇసుక కొరతతో నిలిచిపోతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- ఇసుక రవాణాకు కలెక్టర్ అనుమతులు ఇవ్వాలి - సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఇసుక లేక నిలిచిపోతున్నాయని, దీన్ని ఆసరా చేసుకొని అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్న అక్రమదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడారు. ఇళ్లు లేకుండా స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ పథకంలో ఇళ్లను మంజూరుచేసి నిర్మాణాలకు రూ.5లక్షలు మంజూరు చేయడంతో సిరిసిల్ల పట్టణంలో 700లకు పైచిలుకు ఇళ్ల నిర్మాణాలకు కలెక్టర్ అనుమతుల పత్రాలను అందించారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఓకేసారి నిర్మాణాలను ప్రారంభించడంతో సిరిసిల్లలో ఇసుక కొరత ఏర్పడిందన్నారు. ఇసుక లేక నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. దీనికి అసరగా చేసుకున్న ఇసుకను అక్రమంగా తరలించేందుకు అక్రమదారులు ఇసుక ట్రాక్టర్‌కు 3వేల రూపాయల నుంచి 4వేల రూపాయల వరకు పెంచడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయడంతో పాటు వారంలో మూడురోజులు ఇసుకకు వేబిల్లులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్న అక్రమదారులపై కలెక్టర్ కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

ఈ సమావేశంలో సీపీఎం కార్యదర్శి వర్గసభ్యులు కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, మాల్లారం ప్రశాంత్, మిట్టపల్లి రాజమౌళి తదితరలు పాల్గొన్నారు.

అవినీతి అధికారులను తొలగించాలని ఉద్యమిస్తాం..

- 16న జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా మహాసభలు - జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టులు, చెక్‌డ్యాముల్లో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, వారి ఆస్తులపై సీబీఐ ఆధ్వర్యంలో విచారణ జరిపి వాని ఉద్యోగం నుంచి తొలగించాలని ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు వ్యతిరేకంగా జిల్లాలో లక్ష ఎకరాల ప్రభుత్వ భూమి పేదలకు పంచాలని భూ పోరాటాలకు ఉద్యమం చేపట్టడానికి కమ్యూనిస్టు పార్టీ పూనుకుంటుందన్నారు. గత 100 సంవత్సరాలుగా అడ్డంకులను దాటుకుంటూ సవాళ్ళను ఎదుర్కొంటూ దేశంలోని పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహిస్తోందన్నారు. జిల్లాలో దాదాపు ఇళ్లు లేని నిరుపేదలు 20వేల పైచిలుకు ఉన్నారని, అందరికి డబుల్ బెడ్‌రూంలు ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలన్నారు. జిల్లాలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి ప్రభుత్వ అధికారులు దొరకడం చూస్తుంటే జిల్లాలో దోపిడీ అనేది బహిరంగంగానే జరుగుతోందని అర్థం అవుతోందన్నారు. తంగళ్లపల్లిలోని ఇందిరమ్మ కాలనీలో 1200 మందికి గతంలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాక నిర్మాణం పనులు నిలిచిపోయాయని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 1200 మంది ఇళ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న సిరిసిల్ల పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సీపీఐ 4వ మహాసభలో ఈ సమస్యలపై చర్చిస్తామని పేర్కన్నారు. సీపీఐ మహాసభకు ముఖ్య అతిథులుగా కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గం సభ్యుడు చాడ వెంకటరెడ్డి పాల్గొంటున్నారని అన్నారు. జిల్లాలోని కమ్యూనిస్టులు, కార్యకర్తలు, అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు కడారి రాములు, ఎలిగేటి రాజశేఖర్, అజ్జ వేణు, పంతం రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

వాలీబాల్ అకాడమీ ఎంపిక పోటీలు..

సిరిసిల్ల టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల, సరూర్‌నగర్ వాలీబాల్ అకాడమీల్లో ఏర్పడిన క్రీడాకారుల(విద్యార్థులు) ఖాళీలను భర్తీ చేయడం కోసం మంగళవారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో ఎంపిక పోటీలను జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అర్హత ఉన్న విద్యార్థులు దాదాపు 150 మంది వాలీబాల్ అకాడమి ఎంపిక పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. సరూర్‌నగర్ జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి వెంకటేశ్వరరావు, రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ కోశాధికారి శ్రీకృష్ణప్రసాద్, వాలీబాల్ అకాడమీ కోచ్‌లు రమాదేవి, వీరారెడ్డి, సంపత్, వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి గెన్న లక్ష్మణ్, రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, సీనియర్ వాలీబీల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- కాశీదండి పీఠాధిపతి సుదర్శన స్వామిజీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాశీదండి పీఠాధిపతి సుదర్శన స్వామిజీ


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల్లో భక్తులకు సేవలు అందించడంతో పాటు దేవాలయాల పరిరక్షణలో భాగస్వాములు ప్రజలు కావాలని కాశీదండి పీఠాధిపతి సుదర్శన స్వామిజీ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లోని హరిహరిపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం శ్రీలలిత సేవా ట్రస్ట్ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ రాచవిద్యాసాగర్ గురుస్వామి-సుకన్య దంపతుల నేతృత్వంలో ట్రస్టు కార్యక్రమాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. శ్రీలలిత సహస్రనామ కుంకుమ పూజలు చేయడంతో పాటు పీఠాధీశ్వరులు అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన కాశీదండి పీఠాధిపతి శ్రీసుదర్శన స్వామీజీ మాట్లాడుతూ ప్రజలందరు దైవభక్తి వైపు రావాలన్నారు. దైవసేవలు అందించడంతో పాటు దేవాలయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ట్రస్టు బాధ్యులను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీలలిత ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ విశ్వనాథుల రమేష్, ట్రస్ట్ అధ్యక్షురాలు అడ్డగట్ల లక్ష్మీ, డైరెక్టర్ ఏలేటి విజయ, కోట్టే ప్రేమలత, నునావత్ శాంత, బోయిని ఐలేందర్‌పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేసినందుకు మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా అని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు ప్రశ్నించారు. మండలంలోని కందికట్కూర్ గ్రామసమీపంలోని మధ్యమానేరు కట్టపై మంగళవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, నాయకులు ఉడుతల వెంకన్న, కేవీఎన్‌రెడ్డి, సిద్దం శ్రీనివాస్, కమటం రాములు, మధు, మల్లయ్య, గొట్టెపర్తి పర్శరాం, సావనపెల్లి అనిల్‌కుమార్, పట్నం శ్రీనివాస్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.17 వేల జరిమానా, బాధిత బాలికకు రూ.3 లక్షల పరిహారం చెల్లించాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి మంగళవారం తీర్పునిచ్చారు. రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి జైత భీమయ్య(66) అనే వ్యక్తి 2019 సంవత్సరంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై రాయికల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి డీఎస్పీ వెంకటరమణ, సీఐ రాజేష్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు రాజు, కిరణ్ శ్రీధర్‌లు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు



ప్రమాదానికి గురైన స్కూటీ

పెద్దపల్లి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు గాయపడిన సంఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగింది. మంగళవారం పెద్దపల్లికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని ఓమసియా, భోజన్నపేటకు చెందిన విద్యార్థిని అక్షయలు స్కూటీపై ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడగా స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి

మంథనిరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి జక్కుల రాజకొమురయ్య (49) మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జక్కుల రాజకొమురయ్యకు చెందిన పాడి పశువులు చెరువులో ఉన్నాయి. వాటిని ఒడ్డుకు తీసుకురావటానికి ఆయన చెరువులోకి వెళ్లగా చెరువులోని గుంతలో పడి మృతి చెందాడు. చెరువు ఒడ్డున మృతుడికి సంబంధించిన దుస్తులు, చెప్పులు ఉండటంతో గ్రామానికి చెందిన గట్టయ్య అనే వ్యక్తి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు చెరువులో గాలించగా మృతదేహం లభించింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

శంకరపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేశవపట్నం గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ రైతుకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. కేశవపట్నం గ్రామానికి చెందిన ఆరెపల్లి తిరుపతికి చెందిన పాడి ఆవు మంగళవారం ఉదయం మార్కెట్ యార్డు పక్కన ఉన్న వాగు వద్ద మేత కోసం కట్టేశాడు. ఆవు మేత మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ. 40వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు తిరుపతి కోరుతున్నాడు.

పొలం పండుగ

● నేడు ఏరువాక పౌర్ణమి ● వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు



కరీంనగర్ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పుడమితల్లి పులకరించే పొలం పండుగ ఏరువాక పౌర్ణమి వచ్చేసింది. రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరియనుంది. శ్రమజీవన సౌందర్యానికి సూచికైన ఈ పౌర్ణమి విశేషాలు వేదకాలం నుంచి నేటి వరకు ఉన్నాయి. ఏటా వ్యవసాయ పనులకు సిద్ధమయ్యే ముందు అన్నదాతలు పండుగ జరుపుకుంటారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా పశువులను, వ్యవసాయ పనిముట్లను పూజించి పొలం దున్నేందుకు సిద్ధమవుతున్నారు. ఏరువాక అంటే భూమిని దున్నడం అని అర్థం. జ్యేష్ఠ మాసం శుక్ల పక్ష పూర్ణిమ నాడు ఏరువాకను జరుపుకోవడం ఆనవాయితీ. నైరుతి ఋతుపవనాల రాకతో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని పొలం పనులకు ఆటంకాలు కలుగకూడదని రైతులు ఏరువాకను యజ్ఞంగా భావిస్తారు.

ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం

ఏరువాక పౌర్ణమికి ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం ఉంది. ఏరువాకను జ్యోతిష శాస్త్రవేత్తలు కష్యారంభం, సస్యారంభంగా వ్యవహరిస్తారు. ఔషధులకు పతి అయిన చంద్రుడు నాగలి పనులకు ఉత్తమ నక్షత్రమైన జ్యేష్ఠా నక్షత్రానికి సమీపంలో సంచరించడమే కారణం. రుతువులలో మార్పును సూచిస్తూ ప్రకృతితో మమేకమైన ఈ పండుగ తొలకరి జల్లులతో ప్రారంభమవుతుంది. నాగలి కదిలేముందు క్షేత్రపాలకుడిని పూజించేవారని రుగ్వేదంలో ఉంది. బుద్ధుడి తండ్రి శుద్ధోదనుడు ఏరువాక రోజున రైతులకు ఒక బంగారు నాగలిని అందించేవాడని బౌద్ధ రచనలు చెబుతున్నాయి. పాళీ, ప్రాకృత భాషల్లోని కథల్లోనూ ఈ ప్రస్తావన ఉన్నట్లు సమాచారం. జైమినీయ న్యామాలా గ్రంథంలో, హాలుని గాధాసప్తశతిలో ఈ పండుగ ప్రస్తావన కనిపిస్తోంది.

● ఇలా ఆచరిస్తారు

ఈ పండుగ పూర్తిగా వ్యవసాయానికి, పనిముట్లకు, పశువులకు సంబంధించిన పండుగ కావడంతో రైతులు వ్యవసాయ సాధనాలను, భూమిని, పశువులను పూజిస్తారు. ఎద్దులను కడిగి వాటి కొమ్ములకు రంగులు వేసి ముస్తాబు చేస్తారు. పశువుల పాకలను, పశువులను కట్టే గాటిని, కాడిని, నాగలిని శుభ్రపరిచి పసుపు, కుంకుమలు, గంధంతో అలంకరిస్తారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించి పొంగలిని, భక్ష్యాలను వాటికి ఆహారంగా పెడతారు. మంగళ వాయిద్యాలు, పాటలు, పద్యాలు, కోలాహలం మధ్య సాయంత్రం రైతులు నాగలిని భుజంపై ధరించి ఎద్దులను తోలుకుంటూ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్తారు. అక్కడ భూమిపూజ అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. గోగు నారను తాడులా చేసి తోరణం కట్టి దాన్ని చెర్నాకోలతో కొడుతూ వారికి దొరికిన నారను తీసుకొని ఎద్దుల మెడల్లో, నాగలికి కడతారు. ఉత్తర భారతంలో పలు ప్రాంతాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటకలోనూ ఈ పండుగను వైభవంగా జరుపుకుంటారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో పట్టుకుని అదే గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ కంకణాల సుధాకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న క్రమంలో వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా అనుమతి లేదని గుర్తించామని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ కంకణాల సుధాకర్‌ను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తంగళ్లపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఇంట్లో పని చేస్తూ బీపీ ఎక్కువై కింద పడిపోవడంతో తలకు గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిమల రాజవ్వ (51) ఈ నెల 1న ఇంట్లో పనిచేస్తుండగా బీపీ ఎక్కువై కింద పడిపోయింది. దీంతో రాజవ్వకు తలకు గాయం కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా బ్రెయిన్ డెడ్ కావడంతో మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త రామచంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న జవాన్‌కు సన్మానం

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న జవాన్ తిరుపతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వర్ధినేని రవీందర్‌రావు, శ్రీనివాస్, హరిప్రసాద్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపై దాడి కేసులో తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష

మెట్‌పల్లిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలో అన్నపై దాడి చేసిన తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి కోర్టు న్యాయ మూర్తి అరుణ్‌కుమార్ తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆత్మకూరు గ్రామానికి చెందిన మల్లయ్యకు ఐదుగురు కుమారులు కాగా ఆత్మకూరు గ్రామ శివారులో ఆయనకు ఒక ఎకరం భూమి ఉంది. ఆ భూమిని ఐదుగురు కొడుకులు సమానంగా పంచుకునే క్రమంలో చిన్న కొడుకు బీరయ్య వినకుండా గొడవలు సృష్టించేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో బీరయ్యకు సంబంధించిన 8 గుంటల భూమిని వదిలేసి మిగతా భూమిని నలుగురు అన్నదమ్ములు ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరం వ్యవసాయం చేసుకుంటున్నారు. అన్నదమ్ములు సాగు చేసుకుంటున్న పంటను బీరయ్య 2019లో తన ట్రాక్టర్‌తో ధ్వంసం చేయడానికి ప్రయత్నించగా అన్న ముత్తయ్య అడ్డుగా వెళ్లాడు. దీంతో అన్నను పారతో కొట్టగా అతని కుడి భుజంపై గాయమైంది. దాడి ఘటనపై రెండో తమ్ముడు నడిపి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ నిందితుడు బీరయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ కుమార్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి అరుణ్ కుమార్ నిందితుడు బీరయ్యకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ట్రైనీ ఎస్సైని సర్వీస్ నుంచి తొలగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న సంపత్

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలో దళితుడు బత్తుల మహేందర్‌పై దాడి చేసిన ట్రైనీ ఎస్ఐ భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని టీపీసీసీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జి టి సంపత్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల రోజుల క్రితం మహేందర్‌పై పోలీసులు దాడి చేసిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవడంతో ట్రైనీ ఎస్సై భార్గవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారన్నారు. పోలీసులు ప్రజలను రక్షించడానికి ఉన్నారే తప్ప దౌర్జన్యంగా కొట్టడానికి కాదన్నారు. ట్రైనీ ఎస్ఐ భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించకపోతే హైకోర్టుకు వెళ్తామన్నారు. సమావేశంలో ఆర్ రామచంద్రం, టి వసంత్, సీహెచ్ రాహుల్, మహేందర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డుతోనే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

● భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామి


సమావేశంలో మాట్లాడుతున్న చిలువేరు స్వామి

రామగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): లేబర్‌కార్డు పొందిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ, ప్రమాద బీమా పథకాలను వెల్ఫేర్ బోర్డుతోనే వర్తింపచేయాలని భవన నిర్మాణ కార్మిక సమైఖ్య సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. మంగళవారం కల్వచర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ భవన, నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ఈ నెల 4న ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు దరఖాస్తు చేసుకోవడానికి ఆహ్వానించిందన్నారు. ప్రమాద బీమా రూ.8లక్షలు కాగా శాశ్వత వైకల్యానికి రూ. 5లక్షలు, పాక్షిక వైకల్యం రూ. 4లక్షలు, సాధారణ మరణం రూ. 2లక్షలు ఇవ్వాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారని తెలిపారు. తద్వార సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందె అవకాశం ఉండవని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీలు పెట్టే నిబంధనలతో కార్మికులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే సంక్షేమ ఫలాలను కార్మికులకు అందించాల్సిందిగా డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరునహరి రాజు, ఎస్కే షరీఫ్, భైరిశంకర్, మల్లేష్, శంకర్, రాజయ్య, చంద్రమౌళి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్‌తో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం


పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్‌ను సన్మానిస్తున్న రెవా నాయకులు

జ్యోతినగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం(రెవా) ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ మహమ్మద్ ఫసియొద్దిన్‌తో కరీంనగర్‌లోని పీఎఫ్ కార్యాలయంలో సమావేశమయ్యారు. నిజ వేతన ఆధారిత పెన్షన్(హయ్యర్ పెన్షన్)కు సంబంధించి 230 మంది మాజీ ఉద్యోగులు వారి బకాయి డబ్బుల డీడీలను గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో పీఎఫ్ కార్యాయంలో సమర్పించారని సంఘం నాయకులు గుర్తు చేశారు. 55 మంది విశ్రాంత ఉద్యోగులకు రివైజ్డ్ పీపీవోలు ఈనెలలో జారీ చేస్తామని, జూలైలో మరో 100 మంది రిటైర్డ్ ఉద్యోగులకు జారీచేస్తామని కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకు 10 మంది మాజీ ఉద్యోగులకు రివైజ్డ్ పీపీవోలు జారీ చేసినందుకు పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్, ఎపిఎఫ్‌సి వెంకటేశ్వర్లు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. రీజినల్ పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్‌ను రెవా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం(రెవా) అధ్యక్షుడు ఆకుల రాంకిషన్, ఉపాధ్యక్షుడు మంగళంపల్లి రాంనారాయణ, సంయుక్త కార్యదర్శి చెప్యాల శ్రీపతిరావు, జానకిరాం, తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్లు నరికి దుంగల అపహరణ


తాండ్ర్యాలలో నరికివేసిన టేకు చెట్టు

కథలాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రైతుల పొలాల్లో ఉన్న టేకు చెట్లను నరికివేసి ఎత్తుకెళ్లారు. తీగల వెంకట్రావు, తీగల సత్యారావు, కాల్వ రాజేశం, కనకట్ల ప్రసాద్ అనే రైతులు తమ పొలాల వద్ద టేకు చెట్లను పెంచుకున్నారు. దుండగులు రాత్రి వేళలో 11 చెట్లను నరికివేసి దుంగలను ఎత్తుకెళ్లినట్టు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో దాదాపు 4 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సెల్‌ఫోన్ అప్పగింత


ఫోన్ అందజేస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన మేడిద హరీష్ మే 18న సెల్‌ఫోన్ పోగొట్టుకొని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా మంచిర్యాలలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. మంగళవారం బాధితుడు హరీష్‌కు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు.

విద్యుదాఘాతంతో 40 గొర్రెల మృతి


కటికెనపల్లి శివారులో మృతిచెందిన గొర్రెలు

ధర్మారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన 40 గొర్రెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. చామనపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు కాపరులు కటికెనపల్లి గ్రామ శివారులో గొర్రెలను మేపేందుకు మంగళవారం మధ్యాహ్నం తీసుకెళ్లారు. నల్లవాగు ప్రాంతంలోని సున్నం మాటు వద్ద గొర్రెలు నీరు తాగుతూ వాగు దాటే క్రమంలో విద్యుత్ స్తంభం ఇన్సులేటర్ విరిగి ఇనుప స్తంభం పట్టిపై పడింది. స్తంభం నుంచి చెట్ల కొమ్మల ద్వారా వాగు నీటికి విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో నీరు తాగుతున్న గొర్రెలు షాక్‌కు గురయ్యాయి. ఈ సంఘటనలో 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా 30 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో ఏడి విజయ్‌కుమార్, ఏఈ ఎండీ ఖాసీమ్ సందర్శించారు. చనిపోయిన 40 గొర్రెలకు సంస్థ తరుపున 2 లక్షల 80వేలు రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అస్వస్థతలో ఉన్న జీవాలు ఎప్పుడు చనిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయని, వాటితో కలిపి 6 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేశారు.

నష్ట పరిహారం పూర్తిగా చెల్లించాలి

ప్రమాదవశాత్తు మృతి చెందిన గొర్రెలకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుదాఘాతంతో చామనపల్లి గ్రామానికి చెందిన దాడి ఐలయ్య, దాడి ఓదెలు, నిట్టు మల్లయ్య, భైర రాయలింగు, నిట్టు ముజ్జయ్య, కొమ్మ లచ్చయ్యలకు చెందిన 40 గొర్రెలు మృతి చెందగా 30 గొర్రెల వరకు అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితితో ఉన్నాయి. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ట్రాన్స్‌కో అధికారులు మృతి చెందిన 40 గొర్రెలకు ఒక్కోదానికి 7 వేల చొప్పు న మొత్తం 2 లక్షల 80 వేల నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పగా గొర్రెల కాపరులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. తామంతా 6 లక్షల వరకు నష్టపోయామని అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న గొర్రెలకు కూడా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని బీజేపీ సీనియర్ నాయకులు కన్న అంజయ్య, జిల్లా గొర్రెల కాపరుల సఘం అధ్యక్షులు వేల్పుల నాగరాజు, గొర్రెల సొసైటీ మండల అధ్యక్షులు జంగ మహేందర్ సందర్శించారు.

భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య


హరీష్ (ఫైల్)

బోయినపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం తడగొండ గ్రామానికి చెందిన కుంటాల హరీష్(36)కు కావేరితో 2014లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. హరీష్ గత కొద్ది సంవత్సరాలుగా గల్ఫ్‌బాట పట్టాడు. కొద్ది నెలల క్రితం హరీష్ స్వగ్రామానికి రాగా భార్య కావేరి హరీష్‌ను సూటి పోటి మాటలతో వేధించడమే కాకుండా ఆత్మహత్య చేసుకోవాలంటూ ఇబ్బంది పెడుతుండేది. దీంతో భార్య వేధింపులు తట్టుకోలేక హరీష్ గ్రామంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే తన కుమారుడి మృతికి కోడలు కావేరి కారణమని తల్లి ప్రమీల ఎస్ఐకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ

సుల్తానాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుగ్లాంపల్లి గోదాముల వద్ద షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో లారీకి నిప్పంటుకుంది. అయితే సమీపంలో ఉన్న మిగతా లారీ డ్రైవర్లు, హమాలీలు లారీకి అంటుకున్న మంటలను ఆర్పేందుకు సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో పెద్దపల్లికి చెందిన లారీ కొంత కాలిపోయింది. వివిధ మిల్లుల నుంచి బియ్యం లోడ్‌లతో వచ్చిన లారీలు అన్‌లోడ్ అయ్యాక పక్కన నిలిపి ఉంచారు. అయితే పైన ఉన్న విద్యుత్ తీగలు గాలిదుమారం వలన ఒకటికొకటి తాకుతూ నిప్పురవ్వలు చెలరేగి లారీకి అంటుకున్నాయని ప్రత్యక్షంగా చూసిన వారు తెలిపారు. లారీ డ్రైవర్లు, హమాలీలు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.

ఇసుక లారీ డ్రైవర్ల ధర్నా


కొర్కల్‌లో రోడ్డుపై ధర్నా చేస్తున్న ఇసుక లారీ డ్రైవర్లు

వీణవంక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు ఇసుక రీచ్ యాజమాన్యం రోజులు గడుస్తున్నా లోడింగ్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని లారీ డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. మూడు రోజులు గడుస్తున్నా లారీల్లో ఇసుక లోడింగ్ చేయడం లేదని అన్నారు. ప్రతి రోజు చేయాల్సిన లోడింగ్ చేయకుండా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లా లారీ డ్రైవర్లను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. కొర్కల్ ఇసుక రీచ్ నుంచి అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ


శిక్షకులకు సర్టిఫికెట్ ప్రదానం అధికారులు

రామడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, వాటిని నియంత్రించే పద్ధతులను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని కల్నల్ ఆఫీసర్ ఏకే జయంతి, స్టేషన్ ఫైర్ ఆఫీజర్ రాజు నాయక్ అన్నారు. మండలంలోని వెదిర అల్ఫోర్స్ పాఠశాలలో ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరంలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవలసిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఆస్తినష్టం, ప్రాణనష్టం కాకుండా వెంటనే స్పందించాలని అన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ వి కృష్ణ, సబ్ మేనేజర్ సాగర్‌సింగ్, కేడెట్లు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చొప్పదండి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్, వెదురుగట్ట గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలను, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సువర్ణ, డాక్టర్ మహేష, ప్రియదర్శిని, మండల వ్యవసాయ అధికారి వంశీ, విస్తరణ అధికారులు సాయి ప్రసన్న, సంపత్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చొప్పదండి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖల పేరుతో పలు ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర డీడీఎన్ సంఘం ఉపాధ్యక్షుడు ప్రభాకరాచార్యులు అన్నారు. అర్చక ఉద్యోగులతో పాటు ధూపదీప నైవేద్య అర్చకుల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం కోసం 41 రోజులపాటు డీడీఎన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

మల్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటకు చెందిన మర్రి తిరుపతి గేదెలు రెండు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. మేత కోసం కొండగట్టు సమీపంలోకి వెళ్లగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తాకి గేదెలు మృతి చెందాయని తిరుపతి తెలిపాడు. మృతి చెందిన గేదెల విలువ రూ.1.50లక్షల వరకు ఉంటుందని అన్నాడు.

ఇందిరమ్మ ఇళ్లకు గుత్తేదారుల వల



- 400 చదరపు అడుగుల భవనానికి రూ.10 లక్షలు
- 600 చదరపు అడుగులకు రూ.16 లక్షలు
- లబ్ధిదారులతో ఒప్పందాలు ● అప్పు చేస్తున్న పేదలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నీడలేని నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పల్లెల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేసింది. లబ్ధిదారుల జాబితాను ప్రకటించింది. ఈ నెల 8తో శుభ ముహూర్తాలు ముగియడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అదే అదనుగా భావించిన కొందరు గుత్తేదారులు తాము ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు లబ్ధిదారులకు వల విసిరారు. 400 చదరపు అడుగుల భవనానికి రూ.10 లక్షలు చెల్లిస్తే అన్ని పనులు పూర్తి చేయడంతో పాటు రంగులు వేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేసి ఇస్తామంటూ ముందుకు వస్తున్నారు. 600 చదరపు అడుగుల భవనానికి రూ.16 లక్షలు చెల్లిస్తే నిర్మిస్తామని పేర్కొంటున్నారు.



ప్రభుత్వ నిబంధనలతో తమకు సంబంధం లేకుండా అంతా తామే చూసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బిల్లు మీరే చూసుకోవాలని తేల్చి చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షలతో పాటు రుణం తీసుకుంటే తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా గుత్తేదారులే చూసుకుంటారని భావిస్తున్న లబ్ధిదారులు ఒప్పంద పత్రాలను రాసుకుంటున్నారు. ముందుగా డబ్బులు చెల్లిస్తున్నారు. ఉన్నంతలో సొంతింటి కల సాకారం చేసుకుందామనుకుంటున్న పేదలకు గుత్తేదారులు అన్ని వసతులతో నిర్మించి ఇస్తామని పేర్కొంటుండడంతో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇందిరమ్మ పథకం.. గుత్తేదారులకు వరం

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గుండారం, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, దుమాల, తదితర గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం గుత్తేదారులకు వరంలా మారనుంది.

మండలంలో మొత్తం 643 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు సుమారు 200 ఇళ్లకు భూమి పూజ చేశారు. పల్లెల్లో ఇళ్ల నిర్మాణాల సందడి నెలకొనడంతో గుత్తేదారులు వాలారు. తాము 400, 600 చదరపు అడుగుల ఇంటి భవన నిర్మాణంతో పాటు రంగులు, ఇతర పనులు పూర్తి చేసి తాళం చెవులను అందజేస్తామని పేర్కొంటున్నారు. అందుకు తమకు రూ.10 లక్షలు, రూ.16 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో ఇబ్బందులు లేకుండా ఉంటాయనే ఆలోచనతో గుత్తేదారులతో లబ్ధిదారులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

బిల్లుల చెల్లింపు ఇలా...

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు భూమి పూజ చేసిన నుంచి పనులు పూర్తయ్యే వరకు గృహ నిర్మాణ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

- లబ్ధిదారుడు తన స్వంత స్థలంలో 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలి.
- ప్రభుత్వం చెల్లించే రూ.5 లక్షల్లో పునాది నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.
- రెండో విడతలో గోడలు నిర్మించిన తర్వాత రూ.1.25 లక్షలు జమ అవుతాయి.
- స్లాబ్ దశలో ప్రభుత్వం రూ.1.75 లక్షలను జమ చేస్తుంది.
- ఇంటి నిర్మాణం పూర్తయిన అనంతరం లబ్ధిదారులకు రూ.లక్ష ఖాతాలో జమ చేయడంతో మొత్తం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి సర్కారు అందించే రూ.5లక్షల ఆర్థిక సాయం అందుతుంది.

నిబంధనల మేరకే బిల్లులు : సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట



మండలంలోని గ్రామాల్లో నిరుపేదను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేయడంతో పాటు మంజూరు పత్రాలను అందజేశాం. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను గుత్తేదారులకు అప్పగిస్తూ ఒప్పంద పత్రాలు రాసిస్తున్నారనే విషయం తమ దృష్టికి రాలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్యవేక్షించిన తర్వాత వివిధ దశలో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతుంది.

తెలంగాణ క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నాలుగో తరగతిలో అర్హులైన విద్యార్థులకు ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ ఎంపికలను మూడంచెల పద్ధతిలో ఈ నెల 16 నుంచి 19 వరకు మండల స్థాయిలో, ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జూలై 1 నుంచి 5 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. మూడు క్రీడా పాఠశాలల్లో 60 మంది బాలురు, 60 మంది బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. 3వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య జన్మించి 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లో వివరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. అలాగే ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో ఉంచిన క్యూఆర్ కోడ్

ఎస్‌యూ ఆంగ్ల విభాగంలో డిజిటల్ తరగతులు



డిజిటల్ క్లాస్‌లను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత

గణేశ్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆంగ్ల విభాగంలో డిజిటల్ క్లాసు రూమ్‌ల ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ క్లాస్‌రూమ్‌లు విద్యా సంస్థలకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనేక ప్రయోజనాలను, బోధనను, అభ్యాసాలను నేర్చుకోవడానికి సహకారం అందిస్తాయన్నారు. ఆంగ్ల విభాగాధిపతి విజయ ప్రకాష్ మాట్లాడుతూ డిజిటల్ క్లాస్ రూమ్‌ని అందించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్‌కు, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

లలితపల్లిలో ఎల్లమ్మ బోనాలు

ఎలిగేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు అనుబంధ గ్రామమైన లలితపల్లిలో లక్ష్మీపార్వతిదేవి, రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం శివపట్నం వేసి బద్దిపోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు మహిళలు బోనం ఎత్తుకొని మంగళహారతులతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలివచ్చి బోనాలను దేవతలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు మండల చిన్న గట్టయ్య, నాయకులు మండల శ్రీశైలం, శంకర్, బాపు పోశాలు, రవి, మామిడి రాజయ్య, కనకయ్య, రాములు పాల్గొన్నారు.



ఎల్లమ్మ బోనాలతో మహిళలు

● సుల్తానాబాద్ : మండలంలోని చిన్నకలువలలో మంగళవారం ఎల్లమ్మ బోనాల పండుగను నిర్వహించారు. గ్రామస్థులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ ఆలయానికి

పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పిల్లాపాపలను, పాడిపంటలను చల్లగా చూడు బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని సోమవారం దర్శించుకున్న భక్తులు మంగళవారం అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఉదయాన్నే అమ్మవారికి మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు నెత్తిన బోనాలతో సుమారుగా నాలుగు గంటలపాటు నిరీక్షించినట్లు తెలిపారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు ముందుగా అమ్మవారికి పట్నం వేసి నూతన వస్త్రాలు అందజేసి ఒడి బియ్యం సమర్పించారు. అమ్మవారికి నైవేద్యాన్ని అందజేసి కల్లుసాకతో మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను, పాడిపంటలను చల్లంగా చూస్తే మళ్లీ వచ్చే యేడుకు తిరిగివచ్చి మొక్కులు చెల్లిస్తామని చెప్పి భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఉద్యోగులు క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ వీధుల్లో రద్దీ కనిపించింది.



శివసత్తుల నృత్యాలతో ఆలయానికి వెళుతున్న భక్తులు



బోనాలతో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

డాక్టర్ భూంరెడ్డి మృతి తీరనిలోటు

● ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



భూంరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ భూంరెడ్డి మరణం తీరని లోటని, వైద్య వృత్తితోపాటు సామాజిక సేవకు కృషి చేశారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూంరెడ్డి ఎంఎస్ చదువుతున్న రోజుల్లో ఢిల్లీలోని ఏయిమ్స్‌లో అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్‌నెహ్రూ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, పట్టా అందుకున్నట్లు చెప్పారు. ఆ రోజుల్లో అనారోగ్య కారణాలతో జవహర్ లాల్‌నెహ్రూ ఆసుపత్రిలో చేరిన సమయంలో భూంరెడ్డిని స్వయంగా పిలిపించుకొని వైద్య సేవలు పొందడం గర్వించదగ్గ విషయమని గుర్తుచేసుకున్నారు. అంతకుముందు భూంరెడ్డి కుమారుడు సూర్య నారాయణరెడ్డిని, కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మంత్రితోపాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, చల్మెడ లక్ష్మీనర్సింహారావు పాల్గొన్నారు.

భూంరెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు



భూంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ప్రముఖ వైద్యులు డాక్టర్ భూంరెడ్డి సోమవారం ఆకస్మికంగా మృతి చెందగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం రాత్రి ఆయన ఇంటికి వెళ్లి భూంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ భూంరెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, గడ్డం విలాస్‌రెడ్డి, ఎస్‌ఏ మోసిన్, రాచకొండ చక్రాధర్, పొన్నంసత్యం ఉన్నారు.

నివాళులుఅర్పించిన చాడ

● భగత్‌నగర్ : ప్రముఖ వైద్యుడు భూంరెడ్డి పార్థీవ దేహం వద్ద సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మంగళవారం కరీంనగర్‌లో నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతాప సభ

రాజబహద్దూర్ వెంకటరామరెడ్డి విజ్ఞాన పరిషత్ (రెడ్డి సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.భూమ్‌రెడ్డి సంతాప సభను నిర్వహించారు. అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, కాసర్ల మధుకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బస్‌చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించడంతో పాటు జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను రాష్ట్రం ప్రభుత్వం పెంచడంతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలంటూ నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ ఇప్పటికే గతంలో పెంచిన బస్‌చార్జీలు, విద్యార్థుల బస్‌పాస్ చార్జీల కారణంగా గ్రామాల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. మళ్లీ బస్‌పాస్‌లపై 20 శాతం చార్జీలు పెంచి అమలుచేస్తే బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రధానంగా ఉన్నత చదువు కోసం బస్సులను నమ్ముకున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని చదువుకు దూరమైయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే చాలా రూట్లల్లో విద్యార్థుల కోసం బస్సులను నడపడం లేదన్నారు. బస్సుల సంఖ్య పెంచి ఉచిత బస్‌సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పాసుల చార్జీల పెంచాలనే ఆలోచనలను విరమించుకోవాలని లేకుంటే ఆందోళన చేపడుతామన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని పాఠశాలలు ఉన్నాయని, వాటిని విద్యాశాఖ అధికారులు వెంటనే సీజ్‌చేయాలని అన్నారు.



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టల్‌లకు పక్కా భవనాలను నిర్మించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా బాలికల కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు సాయిభరత్, శివ, నాయకులు జస్వంత్, అఖిల్, అక్షయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పకుర్తి, రామచంద్రపురం గ్రామంలో జరుగుతున్న గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్నాలలో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్



సిరిసిల్లలో టీఆర్‌టీఎఫ్ బడిబాట బైక్‌ర్యాలీ

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (అంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలందరినీ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరిసిల్లలో మంగళవారం తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, బోయన్న గారి నారాయణల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీని పట్టణంలోని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, ఏఐ ఆధారిత విద్య, డిజిటల్ విద్య ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మెంబర్‌షిప్ కన్వీనర్ సుంకిశీల ప్రభాకర్‌రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మోతీలాల్, టీఆర్‌టీఎఫ్ నాయకులు పోతుగంటి రమేష్, మహేశుని లక్ష్మీనారాయణ, గోలీ రాధాకిషన్, ముత్తయ్యగారి నాగరాజు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు



అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

మల్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. మంగళవారం వేకువ జాము నుంచే వేలాదిగా తరలివచ్చిన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండి అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. జగిత్యాల జిల్లా జడ్జి రత్నపద్మావతి మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చిన న్యాయాధికారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

● భక్తులకు ఇబ్బందులు

కొండగట్టు కొండపై వాహనదారులు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో ఆంజనేయస్వామి దర్శనానికి ఇరవై వేలకు పైగా భక్తులు వందలాది వాహనాల్లో తరలివస్తుంటారు. అయితే సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో కొండపైన, వైజంక్షన్, జేఎన్‌టీయూ మార్గం, ఘాట్‌రోడ్డు మొత్తం వాహనాలతో నిండుతున్నాయి. స్వామి వారి దర్శనానికి ఒక్క రోజు ముందే వాహనాలు పార్కింగ్ చేసి పెట్టడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా అధికారులు ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి కొండపైన వాహనాలను నియంత్రించి అసౌకర్యం కలుగకుండా చూడాలని పలువురు భక్తులు కోరుతున్నారు. రద్దీ సమయాల్లో వాహనాలను ఇష్టారీతిలో నిలపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఘనంగా సేవాలాల్ జగదాంబ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్ తండాలో సేవాలాల్ జగదాంబ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గిరిజనులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తిశ్రద్ధల నడుమ మహిళలు అమ్మవారిని నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, పిల్లాపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా,మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభునాయక్, హన్మంతునాయక్, నర్సింహారెడ్డి, తండా పెద్దలు, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

ఇల్లంతకుంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక, గాలిపెల్లి గ్రామాల్లో బుధవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతువేదికలలో జరిగే సమావేశాలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు హాజరవుతున్నందున క్లస్టర్ పరిధిలోని రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రైతుల అభివృద్ధి కోసమే సింగిల్ విండోలు

కోనరావుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభివృద్ధి కోసమే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కొలనూరు సింగిల్ విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు అన్నారు. కోనరావుపేట మండలం కొలనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కర్షక మిత్ర లోన్లు పలువురు రైతులకు మంజూరు కాగా మంగళవారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో రుణాలు చెల్లించి ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మహేష్, డైరెక్టర్లు గోపాడి జ్యోతి, కాసారపు శ్రీనివాస్, జలగం సాయికిరణ్, జవ్వాజి దేవయ్య, తిప్ప రాములు, గురుగుల నాగిరెడ్డి ఉన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

కోనరావుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కొలనూరు గ్రామ నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఓరగంటి నర్సయ్య, గౌరవ అధ్యక్షులుగా ఓరుగంటి శంకర్, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడిగా అభిషేక్, క్యాషియర్‌గా రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు సన్మానం

సిరిసిల్ల టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం ఆర్య వైశ్య సంఘం భవనంలో జిల్లా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 10 తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ఆర్య వైశ్య విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. అదే విధంగా మైసూర్ దత్త పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత పోటీలలో బంగారు పతకం సాధించిన మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లాడి శ్రీనివాస్, సంఘం జిల్లా విద్య కమిటీ చైర్మన్ బచ్చు అశోక్, ఆర్యవైశ్య సత్రం అధ్యక్షులు బుస్స శ్రీనివాస్, సంఘం జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు ఐత వెంకటేశం, మహిళ సంఘం జిల్లా కార్యదర్శి బుస్స సౌమ్య, విద్యా కమిటీ సభ్యులు ఎల్లంకి వెంకటేశం, సిద్ధంశెట్టి శ్రీనివాస్, పప్పుల శ్రీనివాస్, ఎల్లంకి రాజ్‌కుమార్, గంప రాజేందర్, గంప లక్ష్మీనారాయణ, కోటగిరి అంజనేయులు, నాయకులు వెంకటేశం, పబ్బ నాగరాజు, సిద్ధంశెట్టి శ్రీనివాస్, వంగల మహేష్, పాల్గొన్నారు.

గౌడ సంఘం కార్యవర్గం

చందుర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం బండపల్లి గీతా పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా కాశీనాథం గౌడ్ ఉపాధ్యక్షుడిగా వంగ ఎల్లయ్య గౌడ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బుర్ర వెంకట్ గౌడ్, కాసారపు రాములు గౌడ్, పల్లి మల్లేశం గౌడ్, వికృతి ఎల్లయ్య గౌడ్, కొండ లక్ష్మణ్ గౌడ్, కొండ సత్తయ్య గౌడ్, పల్లి రాములు, పల్లి రాజు, కాసారపు నరేష్, సందీప్ గౌడ్, బుర్ర శ్రీకాంత్, కాసారపు లక్ష్మీరాజం గౌడ్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు మొదలాయే..!



పత్తి విత్తనాలను విత్తుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మృగ శిర కార్తెతో వానాకాలం ప్రారంభమైంది. ఇటీవల కురిసిన తొలకరి వర్షాలతో అన్నదాతలు వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. పల్లెల్లో సాగు సందడి నెలకొంది. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి, పదిర, హరిదాస్‌నగర్ , వెంకటాపూర్, దుమాల, అక్కపల్లి, రాజన్నపేట తదితర గ్రామాల్లోని రైతులు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేశారు. పత్తి విత్తనాలు విత్తుతున్నారు. నారుమడిలో నారు ఏపుగా పెరిగింది. మరో వారం రోజుల్లో నాటు పనులు ప్రారంభమవుతాయని రైతులు పేర్కొంటున్నారు.

బీజేపీ కార్యకర్త మృతి.. నివాళులర్పించిన నాయకులు

ముస్తాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన ఓ బీజేపీ కార్యకర్త అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గున్నాల రమేశ్‌గౌడ్(35) బీజేపీలో కార్యకర్తగా సేవలు అందిస్తున్నాడు. రెండు రోజులు కిందట కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ముస్తాబాద్ మండలంలో చేసిన పర్యటనలో రమేశ్‌గౌడ్ ఉత్సాహంగా పాల్గొన్నాడు. బీజేపీ కార్యకర్త అయిన రమేశ్ హఠాత్తుగా మృతిచెందడటంతో జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డిలు రమేశ్ మృతదేహంపై బీజేపీ పతాకం కప్పి నివాళులు అర్పించారు. రమేశ్ మృతిపట్ల రెడ్డబోయిన గోపి, వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి, పొన్నాల తిరుపతిరెడ్డి, బాధ నరేశ్, శ్రీనివాస్‌రావు, కోల కృష్ణ, మహేందర్, రాజేందర్, గోపాల్, రాజిరెడ్డిలు సానుభూతిని వ్యక్తం చేశారు.

గూడెంలో క్షయవ్యాధిపై అవగాహన

ముస్తాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామంలో టీబీ ముక్త్ భారత్ ప్రోగ్రాం కింద క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో టీబీ సూపర్‌వైజర్ మహిపాల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 105కి పైగా టీబీ స్కీనింగ్ పరీక్షలు, 27మంది అనుమానితుల నుంచి తెమడ నూమూనాలను సేకరించామన్నారు. 30 మంది నుంచి సింటమేటిక్ వాళ్లవి ఎక్స్‌రేకి సిరిసిల్ల మెడికల్ కాలేజి, రేడియాలజీ ల్యాబ్‌కు రేఫర్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తుల గీతాంజలి, టీబీ నోడల్ ఆఫీజర్ ప్రసాద్, హెచ్ఎస్ వరలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పి ఉదయ్, ప్రవళిక, ఏఎన్ఎం భాగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

బోయినపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం కొదురుపాక వద్ద ఉన్న ఒర్రెపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు బోయినపల్లి మాజీ సర్పంచ్ సాంబ లక్ష్మీరాజం మంగళవారం వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో ఒర్రె ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రతి సంవత్సరం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. వెంటనే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

వేములవాడ పట్టణ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని 11, 12 వార్డుల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు మూడు కోట్ల రూపాయలకు పైగా నిధులతో వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని 28 వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఒకవైపు పట్టణ అభివృద్ధి మరోవైపు రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. గత పాలకులలాగా ఇచ్చిన మాట తప్పకుండా ఎన్నికల హామీ నెరవేర్చే విధంగా కార్యాచరణతో పని చేస్తున్నామన్నారు. మూలవాగుపై రెండో బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసి పది సంవత్సరాలు గడిచిన గత పాలకులు పట్టించుకోలేదని, బ్రిడ్జి నిర్వాసితులకు పరిహారం కూడా ఇవ్వలేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక బ్రిడ్జి నిర్వాసితులకు సైతం పరిహారం అందించామని, వర్షాకాలంలో బ్రిడ్జి నిర్మాణం మొదలుపెడితే సాంకేతికంగా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వేములవాడ పట్టణం తోట నియోజకవర్గంలోని అన్ని మండలాలు గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషిచేయాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడలో నిర్వహించిన నియోజకవర్గ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా గెలవడంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ మల్లేష్, జిల్లా కోకన్వీనర్ కనికరపు రాకేష్, వేములవాడ పట్టణ కన్వీనర్ ఎర్ర శ్రావణ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు న్యాత నవీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్ పథకం

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద ప్రజలకు గొప్ప వరమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ అర్బన్, రూరల్ మండలాల పరిధిలో అర్హులైన 72 మంది లబ్ధిదారులకు 24లక్షల 31వేల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం కీలకమైన మెడికల్ హబ్‌గా మారిందన్నారు. వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్యభద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో రైతులకు మేలు

వీర్నపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకంతో రైతులకు మేలు జరుగుతుందని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ కే.కనకదుర్గ, కే.భవ్యశ్రీ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కొత్తపల్లి జయతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పంటలకు సిఫార్సు చేసిన మోతాదులోనే యూరియాను వాడాలన్నారు. అధిక మోతాదులో యూరియా వాడటంతో పంటలకు నష్టం కలుగుతుందన్నారు. పచ్చిరొట్ట, వర్మీ కంపోస్టు, పేడ ఎరువులను వినియోగిస్తే రైతులకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. పంట మార్పిడితో కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, వైస్‌చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్లు, ఏఈవోలు దీపిక, రామారావు, విద్యార్థులు ఆశిష్, సుచిత్ర, రైతులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ పరీక్ష..

(5వ పేజీ తరువాయి)

- బస్సు డ్రైవర్ పేరు, చిరునామా, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- డ్రైవర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి బీపీ, షుగర్, కంటి చూపు పరీక్షలను ఆయా విద్యా సంస్థలు చేయించాలి.
- 60 ఏళ్లు పైబడిన వారిని డ్రైవర్‌గా నియమించవద్దు, వాహన డ్రైవర్‌గా ఐదేళ్ల అనుభవం ఉన్నవారినే తీసుకోవాలి.
- కంటిచూపు, వినికిడి సమస్య ఉన్నవారితో డ్రైవింగ్ చేయించవద్దు.
- మద్యం వ్యసనం ఉంటే తొలగించాలి.

ఫిట్‌నెస్ లేకుంటే బస్సులు సీజ్..

- జి వంశీధర్, ఎంవీఐ సిరిసిల్ల



పాఠశాలల యజమాన్యాలు స్కూల్ బస్‌ల నిర్వహణలో నిబంధనలు పాటించా లి. బస్సుల ఫిట్‌నెస్ తప్పనిసరి చేయించాలి. ఫిట్‌నెస్ లేకుండా స్కూల్ బస్సులు రోడ్లపైకి వస్తే సీజ్ చేస్తాం. ఫిట్‌నెస్‌కు వచ్చే ముందు నిబంధనల ప్రకారం బస్సు ఉండేలాగా చూసుకోవాలి. డ్రైవర్లు రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన పెంచు కోవాలి. ఫిట్‌నెస్ లేని బస్సులపై రవాణా శాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుం టాం. ఫిట్‌నెస్‌తో పాటు పొల్యూషన్ సర్టిఫికెట్, ఇతర ధ్రువీకరణ పత్రాలను పొం దాలి. డ్రైవర్లకు ఇప్పటికే అవగాహన కూడా కల్పించాం. ఫిట్‌నెస్‌పై విస్తృత స్థాయి లో తనిఖీలు కూడా చేపడుతాం. 15 సంవత్సరాలు దాటిన బస్సులను, ఇతర అవస రాలకు ఉపయోగించుకున్న వాటిని రిజిస్ట్రేషన్‌లో మార్పులు చేసుకోవాలి.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం కిష్టంపేట, రామారావుపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ అధికారులు భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కిష్టంపేటలో 59, రామారావుపల్లిలో 109 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐలు మహేందర్, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- ఇల్లంతకుంట : రెవన్యూ సదస్సులలో రైతులు పాల్గొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఫారూఖ్ సూచించారు. మండలంలోని పొత్తూరు, పెద్దలింగాపూర్ గ్రామాలలో మంగళవారం రెవన్యూ సదస్సులు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదా బైనామాలపై విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. ప్రతి రైతుకు భూదార్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు రెవన్యూ కార్యాలయాల చుట్టు తిరుగవద్దనే అధికారులు గ్రామాలకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సత్యనారాయణ, ఆర్ఐలు శ్రీకాంత్, శశికుమార్, సింగారెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.
- ముస్తాబాద్ : మండలంలోని చీకోడ్, మోయినికుంట గ్రామాల్లో భూారతిలో భాగంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దార్ సురేశ్, డీటీ అపర్ణ ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. భూసంబంధిత సమస్యలపై, సాదా బైనామా వంటి పలు సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండల్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి జన్మదిన వేడుకలు



ఇల్లంతకుంటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మసీదులో స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మంగళవారం కేక్‌కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. జంగమరెడ్డిపల్లె గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ఇల్లంతకుంటలో జామా మసీదులో ప్రార్థనల అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. బస్టాండ్ ప్రాంతంలో ఎమ్మెల్యే భారీ కటౌట్‌కు క్రేన్ సహాయంతో క్షీరాభిషేకం, టపాసులు కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయానికి నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్లు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలత, మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్, నాయకులు మామిడి రాజు, ఉప్పల అమరేందర్, గుండ వెంకటేశం, బద్దం హన్మంతరెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, ఆనందరెడ్డి, బాలపోచయ్య, మాధవ రెడ్డి, ఒగ్గు రమేష్, జ్యోతిలతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని అనంతారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలతనాగయ్య నోటుబుక్కులను అందజేశారు. పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రారంభం అయిన రోజున తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేయాలని కోరారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్ల నారాయణ, నాయకులు శ్రీనివాస్,చొప్పరి అశోక్ వెంకటేశం, రాజేశం, బడుగు లింగం, రాములు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

- సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల కోర్టు ప్రాంగణంలో మంగళవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కోర్టు అవరణంలో కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ జాయింట్ కన్వీనర్ కడగండ్ల తిరుపతి అధ్వర్యంలో కేక్‌నుకట్‌చేశారు. కార్యక్రమంలో బార్‌అసోషియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల అశ్విని, న్యాయవాదులు బిగుల్ల బాబు, అలీ, అశ్విన్, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.



నోటు బుక్కులు అందిస్తున్న మాజీ ఎంపీటీసీ

అంగన్‌వాడీ కేంద్రాలు తల్లి ఒడిలాంటివి : సీడీపీవో

ఇల్లంతకుంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలు తల్లి ఒడిలాంటివని సీడీపీవో ఉమారాణి పేర్కొన్నారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో మంగళవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో విద్యాబోధన చేయడంతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణీలు, బాలింతల సంరక్షణ కేంద్రాలుగా పనిచేస్తున్నాయన్నారు. గ్రామస్థులు అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ప్రవేశాలను ప్రోత్సహించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాలను స్వంత ఇంటిలాగా తయారు చేయాలన్నారు. వల్లంపట్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని తయారు చేసినట్లు మిగతా కేంద్రాలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు దొడ్ల రేఖ, చిత్రరేఖలతో పాటు తల్లిదండ్రులు, పిలలు పాల్గొన్నారు.

- కోనరావుపేట : కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి, శివంగాలపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను మొదటగా అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు గూడూరి శారద, రేణుక, పంచాయతీ కార్యదర్శి మజీద్, సయ్యద్, ఆశా వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలి



సిరిసిల్లలో ఇంటింటికి తిరుగుతున్న ఉపాధ్యాయులు



ఎన్గల్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను తల్లిదండ్రులు చేర్పించి వారి విద్యాభవిష్యత్తుకు బాటలు వేయాలని ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతోపాటు అడ్మిషన్‌లను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాటలో భాగంగా సిరిసిల్ల పట్టణంలో మంగళవారం శివనగర్ కుసుమరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నాలుగు బృందాలు ఏర్పడి పట్టణంలోని సాయినగర్, గోపాల్‌నగర్, శివనగర్, ప్రగతినగర్, బీవైనగర్‌లలో ఇంటింటికి వెళ్లి శివనగర్ కుసుమరామయ్య జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గత ఐదు సంవత్సరాలుగా విద్యార్థులు సాధించిన ప్రతిభాపాటవాలు, సాధించిన జాతీయ,రాష్ట్ర స్థాయి అవార్డులు, బడిలో ఉన్న అధునికి సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లకావత్‌మోతీలాల్, స్టాఫ్ సెక్రెటరీ కుమ్మరి మల్లేశం, ఉపాధ్యాయులు పాకాల శంకర్‌గౌడ్, జిమ్మిడి సమ్మయ్య, రాజశేఖర్, రామకృష్ణ, రవీందర్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

- చందుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగంకుమార్ అన్నారు. మండలంలోని ఎన్గల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలు అందించడం జరుగుతుందన్నారు. గ్రామస్థులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధిక, మాజీ సర్పంచ్ సత్తయ్య, ఉపాధ్యాయులు, ఎడ్ల కృష్ణ చైతన్య, వంగ తిరుపతి, సుష్మా,వీరగోని చైతన్య, నాయకులు దేవయ్య, మనోహర్, తిరుపతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- తంగళ్ళపల్లి : తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి, అంకుసాపూర్ గ్రామాల్లో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూక్యా రాజు నాయక్, జనార్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంకుసాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

రాజన్న కోడెలకు పచ్చిగడ్డి వితరణ

చందుర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ కోడెలకు చందుర్తి మండలం లింగంపేట రైతులు పచ్చిగడ్డిని మంగళవారం వితరణ చేశారు. రాజన్న కోడెలు ఇటీవల అనారోగ్యంతో 33 మృతి చెందడంతో మూగజీవాలను సంరక్షించడంలో తమవంతుగా పచ్చి గడ్డిని తరలించినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జలగం ముకుందరావు, చంద్రశేఖరరావు, దొంతినేని రామారావు, రమేష్ రావు, బొడపట్ల జలంధర్, ఈగ రవిప్రవీణ్, ప్రతాప్, కృష్ణరావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాల లక్ష్యాలు సాధించాలి..

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య పథకాల లక్ష్యాలు సాధించకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం జిల్లా వెద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సీహెచ్‌వోలు, ఎంపీహెచ్ఎస్‌లతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య పథకాలపై లక్ష్య సాధనలో జిల్లాను ముందుభాగంలో నిలపాలన్నారు. గర్భిణుల వివరాలను నమోదు చేస్తూ వారి చెకప్‌లను సకాలంలో నిర్వహించి మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించాలన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఎన్‌సీడీ కార్యక్రమంలో మధుమేహ, రక్తపోటు, గర్భాశయ క్యాన్సర్, గొంతు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌లపై లక్ష్యాలపై సీహెచ్‌వోలు, ఎంపీహెచ్ఎస్‌లతో సమీక్షించారు. అనంతరం వారికి వర్షాకాలంలో జాగ్రత్తలపై పరిసరాలు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజలిఆల్ఫ్రెడ్, డీఐవో సంపత్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు అనిత, రామకృష్ణ, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, సీహెచ్‌వో శాంత, హెచ్ఈ బాలయ్య, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై అవగాహన

ముస్తాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకంపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, వంట కార్మికులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. డిజిటల్ టీవీల వీడియో ద్వారా శిక్షణ నిర్వహించారు. అనంతరం ఆర్పీగా శ్యాంసుందర్ శర్మ పథకం ఎలా అమలు చేయాలో వివరించారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని, స్టాక్‌ను మెయింటెన్ చేయాలని, లేనిచో చర్యలుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాధకిషన్, రాజేశ్వరి వంట కార్మికులు, సీర్పీలు తదితరులు పాల్గొన్నారు.